# 'మమ!'



ఎమ్మెస్సార్ మూర్తి

"ఎంతకాలం ఉంటాం? ఈ నిలువెత్తు గోడలెందుకు? ఈ ఉన్నంతసేపూ ఇంత కోపతాపాలెందుకు? ఏదో మంచి మిత్రులవుదామనే అసలు కలిశాం. కలతలన్నీ క్షమించేసుకుని మళ్లీ మళ్లీ కలుసుకుంటూ ఉందాం!

నేస్తం!

గతకాలంలో తెలిసో తెలియకో మీ పట్ల నేను చేసిన పొరపాట్లు, తప్పులు ఏమైనా ఉంటే ... మీరు నన్ను మనసారా, ఉదారంగా, ఆత్మీయంగా క్షమించండి! మీరు నన్ను క్షమిస్తారని ఎంతో నమ్మకం. అది నాకూ తెలిస్తే మరింత సంతోషంతో ఇక ఎప్పుడూ కృతజ్ఞురాలిగానే ఉంటాను.

తప్పక క్షమిస్తారు కదూ!
మీ ...."

సంతకంగానీ, పేరుగానీ లేదు.

కవరు మీద నా అడ్రసు చూసుకున్నాను. నా పేరు, ఈ బ్యాంక్ అడ్రస్సు అంతా కరెక్టే! గ్రీటింగ్ కార్డులు పంపించే కవర్లో కంప్యూటర్‌తో ప్రింట్ చేసిన చక్కటి కాగితం. ఒకే మడత....

ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని పూజించమని, పూజించినవారికెవరికో లక్షల ఆస్తి వచ్చిందని, ఈ ఉత్తరం కాపీలు ఏడు మాత్రం ఇతరులకు పంపమని. అలా నిర్లక్ష్యంతో పంపకపోతే ...

షిర్డీ సాయిబాబా ఉత్తరాలు ... ఇలాంటివే ... పంపకపోతే.... బెదిరింపు...

మళ్లీ మళ్లీ చదివాను. కాపీలు తీసే గొడవ లేదు. లాభనష్టాల వివరాలు లేవు. అమ్మయ్య!

పాపం, వాళ్లు నిజంగా నన్ను నొప్పించి బాధపడ్డారేమో! ఉత్తరం బ్యాంక్ అడ్రస్‌కే వచ్చిందంటే ఎవరైనా ఖాతాదార్లేమో! నాతో మాట్లాడేటప్పుడు పోట్లాట వేసుకున్నారేమో!

ఎవరీ మహాతల్లి? ఎవరీమె? అసలీ అమ్మాయి ఎవరాని? లేక మరొకరికి పంపబోయి?! నా అడ్రసు టైపు చేసి మరీ ఉంటే ... అలా అనుకోవడం కుదరలేదు.

షట్టర్స్ వేసిన చప్పుడు. బ్యాంక్ టైమ్ అయిపోయింది. లంచ్ చేయబుద్ధికాలేదు. కుర్చీలో సాగిలపడ్డాను.

నన్ను హర్ట్ చేసినవాళ్లకంటే, నేనే ... నా వల్లనే బాధపడ్డవాళ్లు ఎక్కువేమో!

వాళ్లంతా ఒకర్నొకరు నెట్టుకుంటూ తోసుకుంటూ వచ్చేసి ... మనసులో తిష్ఠవేశారు.

మళ్లీ చదివాను.

'గతంలో తెలిసో తెలియకో మీ పట్ల నేను చేసిన పొరపాట్లు, తప్పులు ఏమైనా ఉంటే మీరు నన్ను మనసారా ఉదారంగా, ఆత్మీయంగా క్షమించండి. మీరు నన్ను క్షమిస్తారని ఎంతో నమ్మకం. అది నాకు తెలిస్తే మరింత సంతోషంతో ఇక ఎప్పుడూ కృతజ్ఞురాలిగా ఉంటాను. తప్పక క్షమిస్తారు కదూ!

మీ....'

ఇలాంటివే నేనూ ప్రింట్ చేసి అందరికీ పంపిస్తే...!

చాలా బాగుందీ ఆలోచన అనుకుంటూ ... అసలెవరెవరికి పంపాలో లిస్టు వ్రాయాలన్న ఆలోచన కూడా వచ్చింది.

ముందు ఎవరి పేరు వ్రాయాలి?

ప్చ్! చేతలతో... మాటలతో.. మనసుతో, మనసులో... మనసారా ఎంతమందిని హింసించానో!

ఏడుపొచ్చింది... ఇంకా బాగా వస్తే బాగుండును. ప్రయత్నించాను.

అంత బాగా రాలేదు కానీ, ఇప్పటికి ఫరవాలేదు.

వాష్ బేసిన్ దగ్గరకి వెళ్లాను. ముఖం కడుక్కున్నాను. అద్దంలో ముఖం... 'ఏడ్పు ముఖం కడుక్కున్నట్టే' ఉంది.

ఎంత రహస్యంగా నవ్వుకున్నానో...

అంతే!

గుర్తొచ్చేసింది.

ఆ అమ్మాయే!

అవును... ఆ అమ్మాయినే!

000

కొత్తగా కట్టినట్టున్న ఇల్లు. పైన అన్ని వసతులున్న ఒకే గది.

నాకు ఈ బ్యాంకు ఉద్యోగమే మొదటిదని చెప్పాను. వెంటనే చేరిపొమ్మన్నారు పార్వతమ్మగారు.

వారి భర్త జియోలాజికల్ సర్వే చేస్తూంటారు. చాలా రోజులు టూర్‌లోనే ఉంటారట. ఓసారి వచ్చి నన్ను పలకరించినప్పుడు సరిగ్గా రాళ్లని ... ఖరీదైన రాళ్లని పరిశీలించినట్టు నన్నూ చూశాడని అనిపించింది. ఇంగ్లీషు సినిమాల్లోని క్యారెక్టర్ యాక్టర్‌లాగా, తెలుగు జానపద సినిమాల్లో సీరియస్‌గా ఆలోచిస్తున్న మహారాజుగారిలాగా ... ఎంతో హుందా.

పార్వతమ్మగారు ఆయనలాగే ఎంతో అందంగా ఉంటారు. అంత గంభీరంగానూ ఉంటారు. వాళ్లిద్దర్నీ ఒకచోట చూసినప్పుడు "నా పెళ్లికి మీరు తప్పక రావాల"ని చెప్తూ మొదటి వెడ్డింగ్ కార్డ్ వాళ్లిద్దరికే ఇవ్వాలనిపించింది.

మొదటివారంలోనే పార్వతమ్మగారు ఇబ్బంది పెట్టేశారు. క్యాంప్‌లో ఉన్న వారి భర్తగారికీ, బెంగుళూరులో చదువుకుంటున్న కూతురికీ ఉత్తరాలు వ్రాసి పెట్టాలి.

వాళ్లాయనకు ఉత్తరం ఎలా మొదలుపెట్టాలో!

"పూజ్యులయిన శ్రీవారికి పార్వతి నమస్కరించి వ్రాయునది." నేను కొంచెం ఇబ్బందిగా చూసి" 'వ్రాయించునది' అని అంటే?" అన్నాను. "ఫరవాలేదు!" అంటూ పెద్దగా నవ్వి, "నేను చెప్పినట్టే వ్రాయండి!" అంది.

"ఇచట నేను క్షేమంగా ఉన్నాను. మీరు సంతకాలు చేసిన చెక్కుల్లో ఇక రెండే ఉన్నాయి. అవసరమైతే మన గదిలో ఉన్న బ్యాంక్ అబ్బాయిచేత తెప్పించుకుంటాను. మీరు వేళకు భోజనం చేసి వేళకు నిద్రపొండి. అమ్మాయి దగ్గరనుండి ఇంకా ఉత్తరం రాలేదు. ఇంతే సంగతులు. మీ...పార్వతి."

బాధగా ముగించాను. బ్యాంకు అబ్బాయి అనకపోతే నాకూ ఓ పేరుంది. అది చెప్పవచ్చు కదా!

రెండో ఉత్తరం.

"చిరంజీవి చిన్నికి అమ్మ ముద్దులు. నువ్వు ఎంతో చక్కగా చదువుకుంటావు అని నాకు తెలుసు. మన గదిలో ఓ అబ్బాయి చేరాడు. అందంగా

## దీప్తీభట్నాగర్ రుసరుసలు!

'పెళ్లిసందడి' చిత్రంద్వారా తెలుగుతెరకు పరిచయమైన దీప్తి అటూ, ఇటూ సినిమాల్లేకపోవడంతో, విదేశాల్లో స్టేజీషోలలో నిర్వహిస్తూ, డబ్బు గడిస్తూంది. ఇటీవల ఆమె అమెరికాలో ఓ స్టేజీషోకు ఒప్పందం కుదుర్చుకుంది. మరో వారంరోజుల్లో దీనికోసం ఆమె అమెరికా వెళ్లాల్సివుండగా, దర్శకుడు సంతోష్‌శివన్ దీప్తిని కలిసి 'లజ్జా' చిత్రంలో ఓ అతిథిపాత్రలో పాటలో నటించవలసిందిగా కోరితే ఆమె సరేనంది. ఆ తరువాతేం జరిగిందని దీప్తిని అడిగితే, "సంతోష్ డేట్స్ అడిగిన రోజునే షెడ్యూల్ మొదలైంది. కాస్ట్యూమ్ సరిగ్గా లేకపోవడంతో షూటింగు వాయిదా పడింది. కాస్ట్యూమ్స్ కుదిరాక చిత్రీకరిద్దామని సంతోష్ అంటే, నేను షోకోసం అమెరికా వెళ్లిపోయాను. తీరా అక్కడినుంచి వచ్చేసరికి నా బదులుగా సోనాలీబెంద్రేను తీసుకున్నారు. సంతోష్ నాకు మంచిమిత్రుడే అయినప్పటికీ ఇంత మోసం చేస్తారనుకోలేదు" అంటూ కనిపించిన ప్రతివారికీ తన బాధను చెప్పుకుంటూంది దీప్తి. అయినా సినిమా ఎక్కువో, స్టేజీషో ఎక్కువో, తెలుసుకోలేకపోతే ఎలా దీప్తీ?

007



ఉంటాడు. బుద్ధిమంతుడనిపిస్తోంది. పదే పదే నువ్వే గుర్తొస్తున్నావు. డబ్బు అవసరమైతే బ్యాంకుకి వెళ్లు. వెంటనే ఉత్తరం వ్రాయి. ఇట్లు మీ అమ్మ!"

అడ్రసు వ్రాసేటప్పుడు తెలిసింది. చిన్ని అసలు పేరు దేవకాంచన.

నా గురించి వాళ్లమ్మాయికి వ్రాసిన మాటలకి ఎంత సంతోషపడ్డానో! పార్వతమ్మగారు వెళ్లాక చాలాసేపు అద్దం ముందే కూర్చున్నానని చాలాసేపటిగ్గానీ తెలియలేదు.

ఓ నాలుగైదు వారాలు బాగానే ఉంది.

వాళ్లు వ్రాసిన జవాబులు చదవడం కూడా అలవాటయింది. దేవకాంచన అక్షరాలు ప్చ్... ఎంత బాగుంటాయంటే ... నేను వెంటనే ఇంగ్లీషు, తెలుగు కాపీలు వ్రాయడం మొదలుపెట్టుకున్నాను. "అంకెలు ఇంత బాగా వేస్తున్నారేవిఁటీ మధ్య?" అంటున్నారు బ్యాంక్‌లో.

ఆ తర్వాత నాకు చాలా కోపం వచ్చింది.

వాళ్లమ్మాయికి నా గురించి ఏమీ వ్రాయమనడంలేదు. కోపం పట్టలేక అడిగాను "మీరు చదువు నేర్చుకుని ఉంటే అందరికీ బావుండేది కదా! ఇప్పుడైనా మించిపోయింది లేదు!"

నా నిరసన గుర్తుపట్టింది కానీ, నవ్వింది. "మీరు చెప్పవచ్చు కదా!" అంది.

"అలాగే... మరి!" అన్నాను వెటకారంగా.

ఆ తర్వాత మళ్లీ ఉత్తరాలలో నా గురించి వ్రాయించింది. ఇక నా ప్రస్తావన లేని ఒక్క ఉత్తరం కూడా లేదు. అటువైపునుండి వచ్చే ఉత్తరాలలో ఏదైనా ఉంటుందేమోనని వెతుకుతాను.

పరమేశ్వరరావుగారి అక్షరాలు రాళ్లలా కనిపిస్తాయి. దేవకాంచన అక్షరాలు ఖరీదైన వెలుగు జిలుగు రాళ్లలా కళ్లు మిరుమిట్లుగొలిపేవి. నా సంగతి లేదు, లేక నాకు కళ్లు చెదిరి కనపడవేమోనని మళ్లీ మళ్లీ వెతుకుతాను. ఊహుఁ, ప్చ్..!

పార్వతమ్మగారి డిక్టేషన్‌లో నా ప్రస్తావన ఉంటూనే ఉంది కదా అని సరిపెట్టుకుంటున్నాను.

అప్పుడప్పుడూ అనిపిస్తూంటుంది

"మీ అమ్మాయి... అదే ఫొటో ... నాకు ... అంటే..." తడబడుతూనైనా అడగాలనిపిస్తుంటుంది. అడగలేదు.

పోనీ, తనకు వ్రాసే ఉత్తరాలలో నేనే ఏదైనా... ధైర్యంగా వ్రాయాలనిపించేది.

ఆ అమ్మాయి ఏదైనా అనుకుంటే... ఇది కూడా దక్కదు. అంచేత స్వంత రచనలు చేయలేదు.

పోనీ వరసలు కలుపుదామని నిర్ణయించుకున్నరోజే మా నాన్నగారు నన్ను చూడటానికి వచ్చారు. నా మంచి చెడ్డలు పరామర్శించి వాళ్లింట్లో భోజనం కూడా చేశారు.

"మా వాడికో మంచి పిల్లను చూసిపెట్టమ్మా!" అని అన్నప్పుడు

"అలాగేనండీ, అన్నయ్యగారూ!" అంది.

"మీ అమ్మాయి ఏం చదువుతోంది?"

"బెంగుళూరులో ఏదో కంప్యూటర్ కోర్సు చదువుతోంది."

"వయస్సు?"

చెప్పింది.

"మరింకేవిఁటమ్మాయ్! నీకు అభ్యంతరం లేకపోతే..."

"ఆఁ...ఆఁ... అబ్బాయిలున్న అన్నయ్యలు అలాగే అంటూంటారు. వదినగారు ఒప్పుకోవద్దూ?"

000 000 000

దేవకాంచన అసలెలా ఉంటుందోనన్న ఆలోచన.

కిందికి వెళ్లినప్పుడు పని కల్పించుకుని గోడమీద ఫొటోలు వెతికాను. లేవు.

ధైర్యంగా మా బ్యాంక్ ఆల్బమ్ వనమహోత్సవాల సందర్భంగా తీసిన ఫొటోలు చూపించి, నేను తీసినవీ చూపించి వాళ్ల ఆల్బమ్ అడిగాను.

లేదట. నిజంగానో, ఉత్తుత్తిగానో!

ఆ పిల్ల సెలవులకు గానీ రాదట.

పిల్ల అంటుంటే నా క్కోపం ఎందుకు వచ్చిందంటే, కనీసం అమ్మాయి అని అనవచ్చు కదా! పిల్లేవిఁటీ?

అలా ఆ గదిలో ఆరు నెలల పందొమ్మిది కాదు పద్దెనిమిది రోజులే ఉన్నాను.

దేవకాంచన మెట్లెక్కుతున్నట్టు, గదిలో చాలాసేపు ఉన్నట్టు అనిపించేది.

నాకు జయపూర్ ట్రాన్స్‌ఫర్ అయింది.

ఇక దేవకాంచనకి ఎవరిచేత ఉత్తరం వ్రాయిస్తారో ఈ పార్వతమ్మగారు?

ఇంగ్లీషు తెలుగు కాపీ పుస్తకాలు వ్రాయడం సగంలో ఉంది. ఓ చూపు చూసి న్యూస్‌పేపర్ కట్టలో ఉంచేసి అమ్మేశాను.

పాపం, చదువు చెప్పమని నోరారా అడిగింది కదా! ఉత్తరమన్నా వ్రాయడం నేర్పలేకపోతిని!

000 000 000

దేవకాంచన అడ్రసు పంపమని పార్వతమ్మగారికి ఉత్తరం వ్రాశాను. పోస్ట్ చేయలేదు.

ఆ అడ్రసు నాకూ తెలుసు కదా! ఏవిఁటో...

"నీ ఫొటో వెంటనే పంపాలి!" అంటూ దాదాపు ప్రేమలేఖ ప్రొఫార్మాలో దేవకాంచనకే ఉత్తరం వ్రాశాను.

పోస్ట్ చేయలేదు.

ప్రేమించడం ఎంత తేలికో, లేదు అనడం కూడా అవతలివారికి అంత తేలికే కదా!

దేవకాంచన అని అనకుండా పార్వతమ్మ గారమ్మాయి సంబంధం అంటూ లాంఛనంగా నాన్నగారికి ఉత్తరం వ్రాశాను.

పోస్ట్ చేయలేదు.

నాన్నగారికి మొహమాటంగా మాట్లాడటం ఎంత బాగా తెలుసో, మార్కెట్ వాల్యూ అంత బాగానూ తెలుసు. నా ఉత్తరాలు కూడా ఎంతో వాల్యూ ఉన్నవి. వాటిల్లో నా ఆత్మ చేతివ్రాలు తేదీతో సహా... అవి బూమరాంగ్ అవుతాయేమో? అవతలివాళ్ల ఎకౌంట్‌లో మనకి మర్యాద ఎంత ఉందో ... అసలుందో లేదో!

000 000 000

నేను మరింకెవర్నీ ప్రేమించలేదు, సినిమా కాలెండర్ని కూడా!

దేవకాంచనతో సైకిలు ఎక్కినట్టూ ... ముందు తను నేను వెనకన్నమాట!

స్కూటరు ఎక్కించుకున్నట్టూ ... ముందు నేను తను వెనకన్నమాట!

స్టాఫ్ కార్లో వెళ్తున్నట్టు ... ఇద్దరం పక్కపక్కనేనన్నమాట.



చాలాసార్లు స్పీడ్ బ్రేకర్లు వచ్చి ఒకరిమీద ఒకరు పడడం కోప్పడడం.. పడటం సరిగ్గా లేదని కోప్పడడం...

కొన్ని మీకూ తెలిసినవే!

అయినా మీకు తెలిసినవి కొన్నే!

అలా చిక్కటి ఆలోచనలు జాగ్రత్తగా ఫ్రీగా ఎంచుకునేవాడిని. మా పెళ్లి ఎన్నిసార్లో! ఎన్నోసార్లు! ఎన్నెన్నిసార్లు అవుతూండేదో! ఇద్దరు పిల్లలు. అయినా రాజస్థానీ సంప్రదాయంలో మళ్లీ...

000 000 000

ఎంచక్కా పడుకోబోయే ముందు దోమతెరలు సర్దుకునేవాళ్లం. ఒకర్నొకరు తాకీ తాకకుండా ఒక మంచం మీద పడుకుని, రాజులు రాజకుమారీలు ... ఏవేవో లవ్ స్టోరీలు చెప్పుకునేవాళ్లం.

ఇంగ్లీషు వాళ్లు ముద్దుపెట్టుకునే ముందు ఒకర్నొకరు చాలాసేపు నెమళ్లు, పావురాళ్లలా చూసుకుంటూ ఉంటారు.

అలాగే ప్రాక్టీసు మొదలెట్టాం.

నాకు మెడ పట్టింది.

"నిద్రలోనిది నిద్రలోనే పోతుందిలేవోయ్!" అన్నారు కొలీగ్స్.

పెద్దగా నవ్వుకున్నాను. వాళ్లకివన్నీ తెలుసేమోనని ముందు, తెలియదని తరువాత తెలిసి...

అలా ముద్దుపెట్టుకోవడం నాకు రాదు. తనకీ రావడంలేదు. బాగా ప్రయత్నించి ఇక దాదాపు ఫరవాలేదు అనుకున్నాం. దాదాపుగా కాబట్టి మళ్లీ మళ్లీ ట్రై చేస్తూ నీకు రాదంటే నీకు రాదని ఒకర్నొకరు చిలిపిగా కొట్టుకునేవాళ్లం.

000 000 000

స్టెప్ బై స్టెప్‌గా తనూ, ఫుల్‌గా నేనూ, యావరేజ్‌గా ఇద్దరం కలిసి ఉన్నాం ... నా అందమైన ఆలోచనలలో.

ఇది ... ఇది నా పట్ల చాలా బాగులేదు. మానసికంగా చేసిన తప్పు ... తప్పున్నర ... ఇప్పుడు ఇలాగే క్షమించమని దేవకాంచనకి వ్రాయాలి.

మనసు కుదుటపడి అదేదో ప్రశాంతంగా ఉంది.


అంటే?!?

అంటే ఆధ్యాత్మిక దూరంలో మళ్లీ నేను తననే ప్రేమించడంలేదు కదా...

అయినా వ్రాయాల్సిందే!

000

ఆ సంతకం లేని క్షమాపణ కాగితాన్ని ఒక్కటినే జాగ్రత్తగా ఫైల్లో ఉంచాను. ఎవరు పంపారో! వారికి మనసులో కృతజ్ఞతలు తెలుపుకుంటూ జాగ్రత్తగా కాపీ చేశాను. ఎందుకైనా




మంచిదని కేరాఫ్ పార్వతమ్మగారు అంటూ ఇంటి అడ్రసు వ్రాశాను. ఆమె కూతురికి పంపిస్తుంది. నా ఉత్తరం క్షేమంగా చేరడం, ఆ అమ్మాయి నన్ను క్షమించడం అదీ ముఖ్యం.

మళ్లీ ఓసారి చూశాను. ఉన్నది ఉన్నట్లుగా వ్రాశాను. ఇదేమిటో చాలా రిలీఫ్‌గా ఉంది. వెంటనే పోస్ట్ చేశాను.

000

ఉత్తరం వచ్చేసింది! రావాలి మరి! మనసారా క్షమించమని వ్రాశాను కదా!

కవరు జాగ్రత్తగా చించి ... ఇంకా జాగ్రత్తగా తీశాను, అమ్మో! పెద్ద ఉత్తరం. అదే అక్షరాల వెలుగు!

"నేస్తం... మీ ఉత్తరం చూసి ఏడ్చాను!"

(నాకూ ఓ క్షణం కళ్లు నీళ్లతో తడిసినట్లయింది. తడుచుకుని...)

"మిమ్మల్ని నేను చూడలేదు. మీరు నన్ను చూళ్లేదు. మీరు నన్ను ఎలా ఎందుకు ఎప్పుడు బాధపెట్టారో తెలియదు. నిజానికి మేమే మిమ్మల్ని బాధపెట్టాము. తనకి మంచి అల్లుడు కావాలని చేసిన లౌకిక తపస్సులో మా అమ్మకి మీరు అలాగే కనిపించారు. మా ఇంట్లో నాన్నగారివి మంచి ఫారెన్ కెమెరాలు ఉన్నాయి. రాళ్లను ఫోటోలు తీసేవి. మా అమ్మకి ఫిల్మ్‌ని డెవలప్ చేయడం కూడా నేర్పారు నాన్నగారు. మీ ఫోటోలు తీసి అమ్మ పంపించింది. నా విషయం మీకు పూర్తిగా చెప్పమన్నాను. మీ ఉత్సాహాన్ని ఇంకా చూసి గానీ చెప్పనన్నది. కాదు, ముందు చెప్పమన్నాను. చెప్పలేదు. నేను ఒప్పుకోలేదు. మే మిద్దరం దాదాపు పోట్లాడుకున్నాం.

మీరు మైసూరు వచ్చినప్పుడు మన జ్ఞానభారతి బ్రాంచ్‌కి రండి. నాకు ఉత్తరాలు వ్రాసిన మీ చేతిని ఓసారి ముద్దెట్టుకుంటాను. మీరేదైనా మాట్లాడితే నేను నవ్వుతాను. నేనేదైనా చెప్పాలను కుంటే చెప్పలేను. వ్రాస్తాను. నా అక్షరాలు బావుంటాయి కదా అందుక్కాదు. నేను మాట్లాడలేను. చెవులూ అంతే. డంబ్ అండ్ డెఫ్.

మన బ్యాంక్ మిల్లీనియం సంచికలో మీ వ్యాసం, ఫొటో కనపడింది. మీరే బ్రాంచిలో ఉన్నారో తెలిసింది. అదే రోజు మా అమ్మ తరఫున డిటిపి లెటరు క్షమించమంటూ పంపాను. నా సంతకం ఎందుకు? నాకు నా ఆత్మ... నా ఆత్మకి నేను. ఆ రోజు నా కెంతో హాయిగా ఉంది.

నే నసలు సంతకం పెట్టలేదు కదా ఆ క్షమాపణలు కోరినది నేనేనని మీ కెలా తెలిసింది? మీకు టెలిపతీలాంటివి ఏమైనా వచ్చా? వస్తే నాకు మాటలు పలకడం, సంగీతం వినడం నేర్పగలరా?

మీరు క్షమించినా, క్షమించకపోయినా నన్ను ఎందుకు క్షమించమని అడిగారో దయచేసి వ్రాయండి. మరో మాట. మా అమ్మకి ఎంతో చదువు ... చాలా బాగా వచ్చు. నా పరిస్థితి చూసి, నా పెళ్లి అయ్యేవరకూ చదవను వ్రాయను అని ఒట్టుపెట్టుకుంది. అంతే! అమ్మ నాకు నేర్పిన అక్షరాలు మళ్లీ తను వ్రాస్తుంటే ఎప్పుడెప్పుడు చూద్దామా అని!

ఇట్లు,
దేవకాంచన."

పార్వతమ్మగారు నా ఎదురుగా నిలబడి ఉన్నట్టే అనిపించింది. ఉన్నపళంగా పెద్ద పెద్ద అక్షరాలతో పేజీ నిండా ఇలా వ్రాశాను.

"అత్తయ్యగారికి నమస్కారం!

మీకు చదువు రాదని నొప్పించాను. నన్ను మీ అల్లుడిగా క్షమించండి. క్షమించినట్లు మీరే మీ చేత్తో స్వయంగా వెంటనే వ్రాయండి!

ఆ అక్షరాలు మీవేనని నేను గుర్తుపట్టే జ్ఞానాన్ని కూడా అదే అక్షరాలలో నింపి మరీ పంపండి!" ■